# వైద్యము - శిక్ష

శ్రీ నర్సింగ్ హోమ్.

పొద్దున పది గంటలు అయింది. అంతా హడావిడిగా ఉంది. డాక్టర్ శ్రీధర్ సెక్రటరీ గ్లోరీ తన రొటీన్ పనులతో చాలా బిజీగా వుంది. ఫోన్ మోగింది.

పని చేస్తూనే ఫోన్ అందుకుంది గ్లోరీ. 'గుడ్‌మార్నింగ్ శ్రీ నర్సింగ్‌హోమ్!' అంది.

'డాక్టర్ శ్రీధర్ వున్నాడా మేడమ్?' ప్రశ్నించిందో కంఠం.

ఆ కంఠం విని చేస్తున్న పని ఆపేసింది గ్లోరీ. ఎవరో డాక్టర్‌గారికి దగ్గరైన వ్యక్తి. అందుకే చనువుగా ఏకవచన ప్రయోగం చేస్తున్నాడు.

'డాక్టర్‌గారు ఓ.టి.లో వున్నారు సర్!' అంది వినయంగా!

'ఎప్పుడు ఫ్రీ అవుతాడు?'

'ఆఫ్టర్ 1.30. మే ఐ నో హూ ఈజ్ ఆన్ ది లైన్ ప్లీజ్?' అడిగింది.

'ఐయాం డాక్టర్ రమేష్. శ్రీధర్ వస్తే నేను ఫోన్ చేశానని చెప్పండి'.

'ష్యూర్ సర్. మీ ఫోన్ నంబర్ ఇస్తారా?

'నా ఫోన్ నంబర్ వాడి దగ్గర ఉంది!'

'సరే సర్, ఐ విల్ కన్వే ది మెసేజ్'.

ఫోన్ డిస్‌కనెక్ట్ అయింది.

గ్లోరీ తన ఎదురుగా వున్న నోట్ బుక్‌లో ఫోన్ ఫ్రం డాక్టర్ రమేష్ ఎట్ 10 ఎ.యమ్. అని రాసింది. ఆ తరువాత పనిలో మునిగి పోయింది.

✧ ✧ ✧

సమయం రెండు గంటలు అయింది. డాక్టర్ శ్రీధర్ ఆపరేషన్ ముగించి తన రూమ్‌కి వచ్చాడు. అలసటగా కుర్చీలో కూర్చున్నాడు. సర్వెంట్ వచ్చి కాఫీ అందించాడు. స్ట్రాంగ్‌గా కాఫీ పడేసరికి కాస్త ప్రాణం తేరుకుంది. టైమ్ చూసుకున్నాడు. రెండు దాటింది. మధ్యాహ్నం కూడా చాలా పనుంది. ఒక్క క్షణం ఆలోచించి షూ విప్పి సోఫాలో పడుకుని పక్కనే వున్న ఫోన్ తీసి నెంబర్ డయల్ చేశాడు.

సుజాత స్వయంగా రిసీవ్ చేసుకుంది!

'ఆ! చెప్పండి శ్రీవారూ!' అంది.

'అదేమిటోయ్! నేను మాట మాట్లాడలేదు. కనీసం హల్లో అనైనా అనలేదు. నేనే అని ఎలా కనిపెట్టావ్?' అడిగాడు శ్రీధర్.

'అదా? అదో దేవరహస్యం! పెళ్ళికి ముందు ఆరేళ్ళు ఘోరమైన తపస్సు చేసి ఈ విద్య నేర్చుకున్నాను'.

నవ్వేశాడు శ్రీధర్. 'చాల్లే నీ తమాషాలు'.

'అరే నేను నిజం చెప్తుంటే నమ్మకపోతే నేనేం చెయ్యనూ? సరే మీరిప్పుడేం చెప్తారో చెప్తే నమ్ముతారా?' అడిగింది సుజాత.

'అలాగా చెప్పు చూద్దాం!'

'సారీ సుజా! కేస్ కాంప్లికేటెడ్. చాలా అలసిపోయాను. ఇంటికి రాలేను. లంచ్ ఇక్కడికే పంపించెయ్' చిలకలా చెప్పింది సుజాత.

నిజంగా ఆశ్చర్యపోయాడు శ్రీధర్. 'ఎగ్జాక్ట్లీ సుజా. ఎలా కనిపెట్టావ్?'

'అప్పుడే అంత ఆశ్చర్యపోకండి. ఇంకో డైలాగ్ కూడా వుంది'.

"ఏమిటిది?" అడిగాడు.

'నీ ప్రేమంతా కురిపిస్తూ భోజనం పంపకు. హెవీ వర్క్ వుంది. అంత భారీగా తింటే నిద్రొస్తుంది. ఏదైనా లైట్‌గా పంపించు'... చెప్పింది సుజాత.

'యు ఆర్ రియల్లీ గ్రేట్ సుజా!' మెచ్చుకున్నాడు శ్రీధర్.

'థాంక్యూ! ఇందాక ఫోన్ చేస్తే మీరు చాలా బిజీగా వున్నారని చెప్పింది గ్లోరీ!' అందుకే లైట్‌గా పెరుగన్నం, సలాడ్ పంపించాను. తినేసి కాసేపు రెస్ట్ తీసుకోండి. వీలైతే మధ్యాహ్నం ఫోన్ చెయ్యండి!' అనేసి ఫోన్ పెట్టేసింది సుజాత.

అలసట, అంతా ఎగిరిపోయింది శ్రీధర్‌కి 'సుజాతలాంటి భార్య దొరకడం నా అదృష్టం' అనుకున్నాడు మనస్ఫూర్తిగా. అలా రోజుకి కనీసం పదిసార్లైనా అనుకుంటాడు.

భార్య పంపిన లంచ్ తినేసి ఓ పావుగంట రెస్ట్ తీసుకొని మళ్ళీ పనిలో మునిగిపోయాడు. పేషెంట్లతోనే సరిపోయింది. సాయంత్రం అయిదు గంటలకి టేబిల్ మీద ఇంపార్టెంట్ మెసేజెస్ అని వున్న పేపర్ మీద పడింది అతని దృష్టి.

మొట్టమొదటి పేరు డాక్టర్ రమేష్. పొద్దున పది గంటలకి ఫోన్ చేశాడు. మరి నా కెవరూ చెప్పలేదేం? చిరాగ్గా సెక్రటరీని పిలిచాడు.

పరుగున వచ్చింది ఉమ. 'ఎస్ సర్?'

'వాటీజ్‌దిస్? రమేష్ ఫోన్ చేశాడని నాకు చెప్పలేదేం? ఇటువంటి పర్సనల్ కాల్స్ వస్తే ఇమ్మీడియట్‌గా నాకు చెప్పమని ఎన్నిసార్లు చెప్పాను. ఎందుకు చెప్పలేదు నాకు' నిలదీశాడు.

బాస్ కళాకళలు స్టాఫ్ అందరికీ తెలుసు. అందుకే ఒక్కక్షణం వూరుకుని, 'రమేష్‌గారి ఫోన్ నేను రిసీవ్ చేసుకోలేదు సర్!' అంది వినయంగా.

శాంతించాడు శ్రీధర్. నిజమే పొద్దునపూట గ్లోరీ వుంటుంది. లంచ్ తర్వాత ఉమ వస్తుంది. గ్లోరీ ఇంపార్టెంట్ మెసేజెస్‌లో మొదట రమేష్ పేరే రాసింది. థియేటర్ నించిరాగానే చూసుకోకపోవటం తనదే తప్పు.

'ఓ.కె. ఉమా. ఇదుగో ఈ నెంబర్‌కి అర్జెంట్‌గా ఫోన్ చేసి నాకు కనెక్ట్ చెయ్యి' అన్నాడు.

తూరీగలా వెళ్ళిపోయింది ఉమ. పది నిముషాలు చూసి మళ్ళీ ఉమను పిలిచాడు. 'ఉమా ఏమైంది?' అని అడిగాడు అసహనంగా.

'ట్రై చేస్తున్నాను సర్ లైన్ దొరకడం లేదు' అంది ఉమ.

'సరే కీప్ ట్రయింగ్!' అని చెప్పి ఇంటికి ఫోన్ చేశాడు.

సుజాత తీసింది.

'సుజీ, పొద్దున రమేష్ ఫోన్ చేశాడట. నేను బిజీగా వున్నాను. ఇక్కడినించి ట్రై చేస్తుంటే లైన్ దొరకటం లేదు. నువ్వు సెల్‌లో ట్రై చెయ్యి' అన్నాడు.

'అలాగే, ఇప్పుడే చేస్తాను' అంది సుజాత. వెంటనే లైన్ దొరికింది మాట్లాడి నర్సింగ్‌హోమ్‌కి ఫోన్ చేసింది.

'ఏవండీ. నేను మాట్లాడాను. రమేష్, స్వర్ణ ఇద్దరూ ఇంట్లో లేరు, సర్వెంట్ మాట్లాడాడు. స్వర్ణకి ఒంట్లో బాగలేదుట. హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళారట. రాగానే ఫోన్ చెయ్యమని చెప్పాను' అంది.

'సర్లే, వాడు చెయ్యకపోతే రాత్రికి మనమే చేద్దాం' అన్నాడు శ్రీధర్.

ఎదురుగా కూర్చునివున్న రమణ వంక చూసి 'పేషంట్లని నువ్వు చూసుకో నేను కాస్త కాఫీ తాగి వస్తాను' అంటూ లేచి వెళ్ళిపోయాడు.

కాఫీ కప్పు తీసుకుని బాల్కనీలో కూర్చున్నాడు. రమేష్ గుర్తు వచ్చాడు. అతని మనసంతా ఆహ్లాదంగా మారిపోయింది. ప్రాణ స్నేహితుడు. ఢిల్లీలో ఆల్ ఇండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో మెడిసన్‌లో చేరిన కొత్తలో పరిచయం అయ్యాడు రమేష్. తన రూమ్ మేట్. ఇద్దరి ఆలోచనలు, అభిరుచులు ఒకటే అవడంతో వాళ్ళిద్దరూ ప్రాణస్నేహితులయిపోయారు.

శ్రీ అని రమేష్ శ్రీధర్‌నీ, రమా అని శ్రీధర్ రమేష్‌నీ ముద్దుగా పిల్చుకునే వారు.

ఆ రోజుల్లోనే ఓసారి సెలవులకు ఇంటికి వెళ్ళినప్పుడు రోజుకి వందసార్లు 'రమ రమ' అని కలవరిస్తుంటే నాయనమ్మ 'ఒరే శ్రీధరా ఎవరా రమ? ఏదో దూరాన చదువుకు పంపించాం కదా అని వెర్రి వేషాలు వెయ్యకు. ఈ ప్రేమలూ, దోమలూ మన ఇంటా వంటా లేవు' అంది మందలిస్తూ.

వచ్చే నవ్వు ఆపుకుని, 'లేదు నాన్నమ్మా! నా రమ లేకుండా నేను బతకలేను. నువ్వు లక్ష చెప్పు. రమను దూరం చేసుకోను' అని ఖచ్చితంగా చెప్పి పోస్ట్ ఆఫీస్‌కి వెళ్ళి 'స్టార్ట్ ఇమ్మీడియట్లీ' అని రమేష్‌కి టెలిగ్రాం ఇచ్చి వచ్చాడు.

ఆ రాత్రి ఇంట్లో గాలిదుమారం లేచింది. నాయనమ్మ పంచాయితీ పెట్టింది. ఆడవాళ్ళంతా ముక్కులెగపీలుస్తూ గద్గద కంఠంతో హితబోధ చేశారు. మగవాళ్ళంతా ముందు ప్రేమగా నచ్చచెప్పి శ్రీధర్ చిద్విలాసంగా చిరునవ్వు నవ్వుతూ ఉండేసరికి కాస్త గట్టిగానే మందలించడం మొదలు పెట్టారు.

ఈ భాగవతం అంతా నడుస్తూ ఉండగానే భుజానికి ఓ ఎయిర్ బ్యాగ్ తగిలించుకుని ఆఖరి బస్సులో దిగాడు రమేష్– 'ఏమిట్రా ఇంత అర్జెంటుగా రమ్మన్నావ్?' అంటూ!

వెంటనే ఎదురెళ్ళి 'వచ్చావట్రా' అని కావలించుకుని లోపలికి తీసుకువెళ్ళి, 'ఇడుగో వీడే మా రమ' అంటూ ఇంట్లో అందరికీ పరిచయం చేశాడు.

అందరూ ఆశ్చర్యపోయారు. ఆ తరువాత, 'ఓరి నీ అఘాయిత్యం బంగారం కానూ!' అని బుగ్గలు నొక్కుకున్నారు. అలా వచ్చిన రమేష్ ఓ వారం రోజులు శ్రీధర్ ఇంట్లో వుండి వెళ్తూ శ్రీధర్‌ని వెంటబెట్టుకు వెళ్ళాడు. ఆ తరువాత వారిద్దరూ ఒకరింటికి మరొకరు ధారాళంగా, రాకపోకలు సాగించడం అలవాటు అయిపోయింది.

ఇద్దరూ పి.జి. పూర్తిచేశారు. శ్రీధర్ ఆర్థోపెడిక్ సర్జన్ అయితే రమేష్ పిల్లల డాక్టరు అయ్యాడు. ఇద్దరికీ హైదరాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్లో ఉద్యోగాలు వచ్చాయి.

శ్రీధర్‌కి సుజాతతో వివాహం జరిగింది. పెత్తనం అంతా తనమీదే వేసుకుని పెళ్ళికి హడావిడిగా తిరిగాడు రమేష్. కుటుంబ ఆర్థిక పరిస్థితులవల్ల, పెళ్ళికావలసిన చెల్లెళ్ళు ఇంకా ఇద్దరు ఉండడం వల్ల రమేష్ కొంతకాలం పెళ్ళి వాయిదా వేశాడు.

మన ప్రభుత్వ విధానం చాలా గొప్పది! అవినీతి, బంధుప్రీతి రాజ్యం ఏలుతూ వుంటాయి. అడుగడుగునా అధికారం తన ప్రతాపం చూపిస్తూ ఉంటుంది. అన్నిచోట్లా రాజకీయం పరోక్షంగా తన కరుణాకటాక్షం చూపిస్తూనే వుంటుంది. అటువంటి పరిస్థితుల్లో ఏలినవారికి ప్రీతిపాత్రులైన ఇద్దరు డాక్టర్లని హైదరాబాదులో పోస్ట్ చెయ్యాలి! అందుకు ఇద్దరు బలిపశువులు కావాలి. చిత్తశుద్ధి, కార్యదీక్ష తప్ప వెనక దన్నులేని రమేష్, శ్రీధర్‌ల మీద పడింది ఈ కత్తివేటు.

తెలంగాణాలో మారుమూల ప్రాంతానికి రమేష్‌నీ, రాయలసీమలో వూరూ, పేరూ లేని వూరికి శ్రీధర్‌నీ విసిరేశారు. ట్రాన్స్‌ఫర్‌లు వద్దని రిక్వెస్ట్ చేసుకున్నారు. కానీ వినే నాథుడు లేకపోయాడు. ఉద్యోగం వదిలే పరిస్థితీ కాదు. సంసారాలూ, బాధ్యతలూ ఉన్నాయి. కాబట్టి తట్టా బుట్టా కట్టుకుని ప్రయాణం అయ్యారు.

జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న రమేష్ నిర్లిప్తంగా వెళ్ళిపోయాడు. కానీ సున్నితమైన మనస్సు కలిగిన శ్రీధర్ మాత్రం ఈ మార్పుకి తట్టుకోలేక పోయాడు.

మంచి ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకొని పేషెంట్లను దైవంగా భావించి సేవ చేస్తున్న తనను తొలగించి ఊరూ, పేరూ లేని ఓ కాలేజీకి డొనేషన్ కట్టి చదువు కొనుక్కుని

ప్రతీ పేషంట్‌నీ 'ఇంటికి వచ్చి కనిపించు' అనే ఓ మామూలు డాక్టర్‌కి పట్టం కట్టడం అవమానంగా భావించి బాధపడ్డాడు.

కొత్త ఊళ్ళో, తన సమర్థతకి తగిన కేసులు రాక, ఒకవేళ వచ్చినా, ఆపరేషన్ చేసే సౌకర్యం లేక పట్నానికి పంపిస్తూ తన నిస్సహాయతకి తనే బాధపడ్డాడు. నిరాశతో కుంగిపోయాడు.

భర్తలో వస్తున్న మార్పు చూసి బాధపడింది సుజాత. రోజు రోజుకీ లోలోపలే మథనపడుతూ మౌనంగా వుంటున్న భర్త స్థితి చూసి కంగారు పడింది. మార్గాంతరం ఆలోచించింది.

సుజాతకి రెండెకరాల పొలం ఉంది. పుట్టింటివారు పసుపు, కుంకుమల కింద ఇచ్చారు. శ్రీధర్ వాటాకి కొంత పొలం, మామిడి తోటలు వున్నాయి. అందరూ చర్చించి ఒక నిర్ణయానికి వచ్చారు.

ఆస్తి అంతా అమ్మేసి విజయవాడలో స్వంత నర్సింగ్‌హోమ్ నిర్మించుకున్నాడు శ్రీధర్.

మొదట్లో అతని మనస్సు చివుక్కు మనేది. వైద్యానికి నిక్కచ్చిగా డబ్బు వసూలు చెయ్యటం వృత్తి ధర్మానికి విరుద్ధంగా అనిపించేది. కానీ వృత్తినే వ్యాపారంగా మలచుకున్నప్పుడు ఆత్మవంచన తప్పదు. రేస్‌లో పాల్గొనడానికి సిద్ధపడిన తర్వాత ప్రథమ స్థానం కోసం పరుగూ తప్పదు.

అదృష్టం కలసివచ్చింది.

సమర్థుడు, సౌమ్యుడు, చేతి చలవ కలవాడు కాబట్టి దిన దిన ప్రవర్ధమానంగా పెరిగింది అతని ప్రాక్టీస్. ప్రస్తుతం నగరంలోని ప్రముఖ నర్సింగ్‌హోమ్స్‌లో ఒకటి శ్రీనర్సింగ్‌హోమ్. పేరు, ప్రతిష్ఠలు, కుప్ప తెప్పలుగా ధనం. పెద్దకొడుకు అమెరికాలో ఎమ్.ఎస్. చేస్తున్నాడు. రెండోవాడు మెడిసన్ చేస్తున్నాడు.

శ్రీధర్ ప్రాక్టీస్ ప్రారంభించిన కొత్తల్లో రమేష్ పెళ్ళి జరిగింది. ఎంత ప్రయత్నించినా పని వత్తిడి వల్ల వెళ్ళలేకపోయాడు శ్రీధర్.

'చూడరా నా ఖర్మ. నిన్ను పసుపు బట్టలతో చూడాలనే నా కోరిక నెరవేరడం లేదు' అని ఫోన్లో చెప్పి బాధపడ్డాడు.

పెళ్ళి ఉదయం 10 గంటలకి. లక్షసార్లు తల్చుకున్నాడు స్నేహితుడిని. ఆ రోజంతా కాంప్లికేటెడ్ కేసులే. అందుకే రాత్రి ఇంటికి వెళ్ళకుండా నర్సింగ్‌హోమ్‌లోనే వుండిపోయాడు.

అర్ధరాత్రి పదకొండింటికి ఫోన్ చేసింది సుజాత. 'మీరు వెంటనే ఇంటికి రండి' అంది. 'సారీ సుజా రాలేను' అన్నాడు శ్రీధర్.

'అలా కాదు. పది నిముషాల్లోనే వెళ్ళి పోదురుగాని రండి' అనేసి ఫోన్ పెట్టేసింది. ఎంతో బలమైన కారణం వుండకపోతే సుజాత అలా రమ్మనదు.

వెంటనే ఇంటికి వెళ్ళాడు. గుమ్మంలోనే ఎదురయ్యింది సుజాత. 'ఏమిటంత అర్జెంట్?' అడిగాడు.

'మీకోసం ఎవరో వచ్చారు!' చెప్పింది సుజాత.

'వస్తే ఏదో చెప్పి పంపించాల్సింది!' విసుకున్నాడు.

'ఎంత చెప్పినా వినకపోతే ఏం చెయ్యను?'

విసురుగా లోపలికి వెళ్ళాడు. ఎదురుగా ఉన్న వ్యక్తులని చూసి నిర్ఘాంతపోయాడు.

ఎదురుగా రమేష్, పక్కన అతని వధువు. పసుపు బట్టలు, తల మీద బెల్లం జీలకర్ర, మెడలో కర్పూరం దండలు.

'ఏమిట్రా అలా చూస్తున్నావు? పసుపు బట్టలతో చూడాలని వుందన్నావుగా. అందుకే వచ్చేశాను. ఇదుగో నా భార్య స్వర్ణ' అంటూ దగ్గరికి వచ్చిన స్నేహితుడిని చెమ్మగిల్లిన కళ్ళతో తనివితీరా చూసుకుని ఆదరంగా కావలించుకున్నాడు.

'ఇదేమిట్రా ఎలా వచ్చావు?' అడిగాడు.

'ఏముంది? పగలంతా పెళ్ళి కార్యక్రమాలు, రాత్రి భోజనాలు అయ్యాక అప్పగింతలు చేశారు. అవి కాగానే మా వాళ్ళందర్నీ అటు వెళ్ళమని మేమిద్దరం ఇటు వచ్చాం. ఓ పదినిముషాలుండి వెళ్ళిపోతాం. తెల్లవారేలోగా గృహప్రవేశం కావాలట. ఆ షరతుమీదే పంపించింది మా అమ్మ' అన్నాడు రమేష్.

కానుకలిచ్చి బట్టలు పెట్టి ఆదరంగా సాగనంపారు శ్రీధర్, సుజాత. ఆ తర్వాత జీవిత సాగరంలో అనంతమైన పయనం. రమేష్‌కి ఇద్దరు పిల్లలు, కొడుకు ఎమ్ ఎస్సీ చదివి పిహెచ్‌డి చేస్తున్నాడు. కూతురు మెడిసిన్‌లో చేరింది. గవర్నమెంట్‌లో ప్రమోషన్లు వచ్చాయి. హోదా కూడా పెరిగింది. కనకవర్షం కురవకపోయినా దేనికీ లోటు లేదు. డాక్టరుగారంటే అందరికీ గౌరవమే. కడుపులో చల్ల కదలకుండా జీవితం జరిగిపోతూంది.

ఏ రెండేళ్ళకో ఒకసారి ఏదో సందర్భంలో కలుస్తూనే వున్నారు మిత్రులిద్దరూ. అప్పుడప్పుడు ఫోన్ చేసుకోవడం, గ్రీటింగ్స్ పంపుకోవడం చేస్తూ తమ స్నేహాన్ని భద్రంగా కాపాడుకుంటూనే వున్నారు.

✧ ✧ ✧

హాస్పిటల్ నుంచి వచ్చాక రెండు మూడు సార్లు ట్రై చేశాడు శ్రీధర్. రెస్పాన్స్ లేదు. చివరికి పదకొండు గంటలకి ఫోన్ మోగితే చివాల్న లేచి అందుకున్నాడు.

'ఏరా బావున్నావా?' అన్నాడు రమేష్.

'పొద్దున నువ్వు ఫోన్ చేశావట కదరా! నేను బిజీగా వున్నాను. సాయంత్రం నుంచి ట్రై చేస్తున్నాను. నువ్వు దొరకలేదు' అన్నాడు శ్రీధర్.

కాసేపు యోగక్షేమాలు మాట్లాడుకున్న తర్వాత – 'శ్రీ నాకో ప్రాబ్లమ్ వచ్చిందిరా!' అన్నాడు రమేష్.

'ఏమిట్రా అది?' అడిగాడు శ్రీధర్.

'స్వర్ణకి ఈ మధ్య ఆరోగ్యం అంత బాగాలేదు టెస్ట్ చేయిస్తే లేమినెక్టమి చెయ్యాలంటున్నారు. నువ్వోసారి చూస్తే?'

'అలాగా! అయితే ఓ పనిచెయ్ వెంటనే స్వర్ణని తీసుకురా, నేను చూసుకుంటాను'.

అదికాదు. నేను రిపోర్ట్స్ అన్నీపంపిస్తాను. నువ్వు చూసి నీ ఒపీనియన్ చెప్తే ఇక్కడే చేయిస్తాను. ఇక్కడైతే మాకు అన్ని ఫెసిలిటీస్ వున్నాయి కదా!' అన్నాడు రమేష్.

'శభాష్. స్నేహానికి నిదర్శనం అంటే నువ్వే. నేను పేరు పొందిన ఆర్థోపెడిక్ సర్జన్ని. నాకు అన్ని ఫెసిలిటీస్ వున్నాయి. నా ఫీజుకి జడిసి నువ్వు నీ భార్యకి గవర్నమెంట్ హాస్పిటల్లో ఆపరేషన్ చేయిస్తావా? ఎదురుగా లేకపోబట్టి బతికి పోయావు' మండిపడ్డాడు శ్రీధర్.

'అబ్బ! నా మాట వినరా!' నచ్చ చెప్పాలని చూశాడు రమేష్.

'ఇంకేం మాట్లాడకు. రేపే బయలుదేరి వచ్చెయ్!' ఆజ్ఞాపించాడు శ్రీధర్.

'బావుంది లేడికి లేచిందే ప్రయాణమా! రెండ్రోజుల్లో మాకు మా బాస్ ఇన్‌స్పెక్షన్ వుంది'.

'మీ బాసూ, నువ్వూ కట్టగట్టుకుని గంగలో దూకండి. స్వర్ణని మాత్రం రేపే రైలెక్కించు. నాకు ఫోన్ చేస్తే నేను రిసీవ్ చేసుకుంటాను. ఇంకేం మాట్లాడకు...' అని ఫోన్ పెట్టేశాడు శ్రీధర్.

'ప్రతి దానికీ నాన్చుడు, తాత్సారం! ఎక్కడికి పోతాయి గవర్నమెంటు బుద్ధులు?' అని విసుక్కున్నాడు.

✧ ✧ ✧

అనుకున్న ప్రకారం స్వర్ణని రిసీవ్ చేసుకున్నాడు శ్రీధర్.

"నువ్వే వచ్చావేమిటి అన్నయ్యా? కారిచ్చి ఎవరినైనా పంపిస్తే సరిపోయేది కదా!" అంది స్వర్ణ రైలు దిగగానే.

'ఫర్వాలేదులేమ్మా! ఇంతకీ మా వెధవాయ్ ఎలా వున్నాడు?' అంటూ కుశల ప్రశ్నలు వేశాడు. దారంతా కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నారు.

ఇంటికి రాగానే ఎదురొచ్చి కావలించుకుంది సుజాత. ఆదరంగా లోపలికి తీసుకువెళ్ళింది.

కాఫీ తాగుతూ 'ఏవమ్మా నీ రిపోర్ట్లు' అని అడిగాడు శ్రీధర్. సూట్కేస్లోంచి ఫైల్ తీసి ఇచ్చింది స్వర్ణ.

ఎక్స్-రే మిగిలిన టెస్ట్ల రిపోర్టులు అన్నీ చూశాడు.

'ఆపరేషన్ చెయ్యాలి తప్పదు' అన్నాడు.

స్వర్ణ మొహంలో భయం. 'అన్నయ్యా మందులతో తగ్గదంటావా? అపరేషనంటే ప్రమాదం కాదా?'

'కాదమ్మా, ఆపరేషన్ మేజరే. కానీ ప్రమాదం ఏమీ లేదు. నేను ఎన్నో కేసులు చూస్తూనే వుంటాను. అయినా డాక్టరు భార్యవి, డాక్టర్ చెల్లెలివి నీకు ఆపరేషన్ అంటే భయం ఏమిటమ్మా' అన్నాడు నవ్వుతూ.

'నేను ఏమైపోతానో అని భయం లేదు అన్నయ్యా! కానీ పిల్లలింకా చిన్నవాళ్ళు. బాధ్యతలు తీరలేదు. ఈయన చూడబోతే పసిపిల్లవాడితత్వం. నాకేదైనా అయితే?'

'చాల్లే వూరుకో స్వర్ణా. చదువుకున్న దానివి. అన్నీ తెలిసిన దానివి. పల్లెటూరి గబ్బిలాయిలా ఆపరేషన్ పేరెత్తితే భయపడతావేం? నీకు ఏమీ కాదు. మీ అన్నయ్య ఇటువంటి ఆపరేషన్ అతి సునాయాసంగా చేసేస్తారు!' అని ధైర్యం చెప్పింది సుజాత.

శ్రీధర్ హాస్పిటల్‌కి వెళ్ళిపోయాక ఆడవాళ్ళిద్దరూ కబుర్లలో పడ్డారు. సుజాత వైభోగం చూసి మనస్ఫూర్తిగా ఆనందించింది స్వర్ణ.

'అవును స్వర్ణా అప్పుడు వాళ్ళు అలా ట్రాన్స్‌ఫర్ చెయ్యడం మంచిదే అయింది. జీవితంలో స్థిరపడ్డాం. అన్నయ్యని కూడా ఇక్కడికి రమ్మని చెప్పు' అంది సుజాత.

'ఆయన స్వభావం నీకు తెలుసుగా వదినా? అయినా ప్రస్తుతానికి మాకు లోటు ఏమీ లేదు. రిటైర్ అయ్యాక కావాలంటే వస్తారు' అంది స్వర్ణ.

✧ ✧ ✧

ఆ రాత్రి రమేష్‌తో మాట్లాడాడు శ్రీధర్. 'ఆపరేషన్ చెయ్యాల్సిందేరా, తప్పదు. చాలా సఫర్ అవుతోంది కదా! వీలైనంత త్వరగా చేసేద్దాం!'

'సరే అయితే ఒకటి రెండు నెలల్లో వీలు చూసుకుని...'

రమేష్ మాటలకి మధ్యలోనే అడ్డుపడ్డాడు శ్రీధర్.

'ఎందుకు వూరికే వాయిదా వెయ్యడం? ఆపరేషన్ తప్పదని తెలిశాక ఎంత త్వరగా చేసేస్తే అంత త్వరగా తన బాధ తగ్గుతుంది కదా! స్వర్ణ ఎలాగూ ఇక్కడే వుంది. నేను డేట్ ఫిక్స్ చేస్తాను. నువ్వు సెలవు పెట్టి వచ్చెయ్! అన్నాడు.

'సరే నీ ఇష్టం. మరి సుమారుగా ఎంత అవసరం వుంటుంది? ఎంత తీసుకురాను? అడిగాడు రమేష్'

'ఏమిటి? డబ్బు గురించా నువ్వు మాట్లాడేది? నన్నింత అవమానిస్తావని కల్లో కూడా అనుకోలేదురా నేను' అన్నాడు శ్రీధర్ బాధగా.

'అది కాదురా! నువ్వు తీసుకోవు సరే. మరి మిగిలిన వాళ్ళకైనా ఇవ్వాలి కదా!'

'అవన్నీ నీకెందుకురా? నాలుగు జతలు బట్టలు సర్దుకుని రా నువ్వు. మిగిలిన విషయాలు నాకొదిలెయ్'.

'సరే నీ ఇష్టం. ఎప్పుడు రమ్మంటావు?' అడిగాడు రమేష్.

'డేట్ ఫిక్స్ చేసి చెప్తాను' అన్నాడు శ్రీధర్.

✧ ✧ ✧

బ్లడ్ టెస్ట్ వగైరా ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసి డేట్ ఫిక్స్ చేశాడు శ్రీధర్. రమేష్ వచ్చేశాడు.

'పిల్లలకి చెప్దామంటారా?' అంది స్వర్ణ.

'ఎందుకు అనవసరంగా వాళ్ళని కంగారు పెట్టడం? అందులోనూ స్వీటీకి ఎగ్జామ్స్ కూడా ఉన్నాయి కదా! ఆపరేషన్ అయ్యాక నిదానంగా చెప్దాం' అన్నాడు రమేష్.

ఆపరేషన్ ముందురోజే హాస్పిటల్లో జాయిన్ చేశారు స్వర్ణని. స్పెషల్ రూమ్ ఇచ్చాడు శ్రీధర్. రొటీన్ చెకప్‌లు అన్నీ చేశారు. మర్నాడు ఉదయం పది గంటలకి ఆపరేషన్.

ఎనిమిది గంటలకి పేషెంట్‌ని రెడీ చేశారు సిస్టర్స్. రొటీన్ డిక్లరేషన్ ఫామ్ మీద సంతకం చేశాడు రమేష్.

శ్రీధర్ హాస్పిటల్‌కి వచ్చాడు. ఏర్పాట్లు అన్నీ చెక్ చేసుకుంటున్నాడు. డాక్టర్‌గారికి ఎంతో దగ్గరవాళ్ళు కాబట్టి స్టాఫ్ అంతా అమిత జాగ్రత్త తీసుకుంటున్నారు.

'శ్రీ లోపలికి నేనూ రానా!' అన్నాడు రమేష్.

'ఇంకా నయం. నువ్వెందుకు సత్రకాయలా? నీకీ స్పెషల్ రూమ్ ఇచ్చాను కదా! అందులో రిలాక్స్ అవు. కాదంటే లక్షణంగా మార్నింగ్ షోకి వెళ్ళు' అన్నాడు శ్రీధర్ నవ్వుతూ.

ఫ్లాస్క్‌తో కాఫీ, బిస్కట్లు, పళ్ళు తీసుకుని వచ్చింది సుజాత.

పేషెంట్‌ని థియేటర్లోకి తీసుకెళ్ళే ముందు రమేష్‌ని పిలిచారు. సుజాత కూడా వెళ్ళింది.

భర్తని చూసి పేలవంగా నవ్వింది స్వర్ణ.

'ఏం ఫర్వాలేదు. ధైర్యంగా వుండు. నాల్రోజుల్లో లేడి పిల్లలా తిరుగుతావు' – ధైర్యం చెప్పాడు రమేష్.

'అవును స్వర్ణా, నువ్వు ఇంటికి రాగానే నాకు గుత్తొంకాయ కూర చేసి పెట్టాలి' అంది సుజాత.

చెమ్మగిల్లిన కళ్ళతో నవ్వేసింది స్వర్ణ.

సిస్టర్ వచ్చి 'డాక్టర్ ఇక మీరు వెళ్ళండి' అంది. స్వర్ణ నుదుట ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయింది సుజాత.

'ఓ కె. డార్లింగ్ భయపడకు ధైర్యంగా వుండు' అన్నాడు భార్య చెయ్యి పట్టుకుని.

'నాకేం ఫర్వాలేదు. మీరు ధైర్యంగా వుండండి' అంది స్వర్ణ తెచ్చిపెట్టుకున్న నవ్వుతో.

'ప్లీజ్ డాక్టర్' అంది సిస్టర్ అతి మర్యాదగా.

రమేష్ బయటికి వచ్చేశాడు.

స్టాఫ్ లోపలికి వెళ్ళారు. స్వర్ణని స్ట్రెచర్ మీదికి మార్చారు. స్ట్రెచర్ తోసుకుంటూ థియేటర్‌లోకి తీసుకువెళ్ళారు. స్వర్ణగుండె దడదడలాడింది.

థియేటర్‌లో చాలామంది వున్నారు. స్వర్ణని టేబిల్ మీదికి మార్చారు. పైన పెద్ద లైట్. పక్కనే పరికరాలు సిద్ధం చేసుకుంటున్నారు సిస్టర్స్. మరెవరో, అందరి మొహాలు ముసుగుల వెనుక దాక్కున్నాయి. తలల మీద కేప్స్. అందరూ ముదురు ఆకుపచ్చ డ్రెస్ వేసుకున్నారు. చిన్నగా తమలో తామే ఏమిటో మాట్లాడుకుంటున్నారు.

'డాక్టర్ శ్రీధర్‌గారు లేరా?' దీనంగా అడిగింది స్వర్ణ.

'ఇక్కడే వున్నానమ్మా' అంటూ చెయ్యి పట్టుకున్నాడు శ్రీధర్.

ఆశ్చర్యంగా చూసింది స్వర్ణ. 'నేను గుర్తే పట్టలేదు అన్నయ్యా' అంది.

అతని కళ్ళలో నవ్వు కనిపించింది.

శ్రీధర్ సైగ అందుకుని సీనియర్ అనస్థటీస్ట్ భాస్కర్, జూనియర్ అనస్థటీస్ట్ రాజా తమ తమ స్థానాల్లోకి వెళ్ళిపోయారు.

అసిస్టెంట్ సర్జన్స్ భారతి, రమణ ముందుకి వచ్చారు.

స్వర్ణకి అనస్థీషియా ఇచ్చారు. స్వర్ణ మత్తులోకి జారిపోయింది. వెల్లకిలా పడుకున్న స్వర్ణని భద్రంగా బోర్లాపడుకోబెట్టారు.

శ్రీధర్ ఆపరేషన్ మొదలు పెట్టాడు. కండిషన్ స్టడీగా వుంది. సీనియర్ అనస్థటీస్ట్ భాస్కర్, జూనియర్ అనస్థటీస్ట్ రాజాకి సైగచేసి థియేటర్ నుండి బయటికి వచ్చాడు. పక్కనే వున్న రెండో థియేటర్‌లో ఇంకో కేస్ వుంది.

లో బేక్ (Low Back) ఓపెన్ చేశారు. వెన్నుపూసని ఎక్స్‌పోజ్ చేశాక రెండు వెన్నుపూసల మధ్య వున్న డిస్క్‌ని తీస్తూ వుండగా చిజిల్ వెళ్ళి అయోర్టాకి తగిలింది.

✧ ✧ ✧

స్పెషల్ రూమ్‌లో కూర్చుని వున్నారు సుజాత, రమేష్, ఫోన్ చేసి అడిగింది సుజాత. ఆపరేషన్ ప్రారంభం అయిందని చెప్పారు. ఇద్దరూ ఏవో పాత కబుర్లు

చెప్పుకుంటూ కూర్చున్నారు. రమేష్ మొహంలో టెన్షన్ గమనించింది సుజాత. 'అన్నయ్యా కాసేపు రిలాక్స్ అవు. లేదా అలా బయటికి వెళ్ళిరా' అంది.

ఆలోచిస్తే అదే మంచిదనిపించింది రమేష్‌కి. 'వూరికే అలా సెంటర్ దాకా వెళ్ళొస్తాను. నువ్వు మాత్రం ఏం చేస్తావు? ఇంటికి వెళ్ళు' అన్నాడు.

'ఇంకో అరగంట ఆగి వెళ్తాను. నేను భోజనం చేసి నీకు లంచ్ తీసుకొస్తాను' అంది సుజాత.

రమేష్ బయటికి వెళ్ళాడు.

✧ ✧ ✧

ఆపరేషన్ జరుగుతూండగా బి.పి. సడన్‌గా డ్రాప్ అయింది. జూనియర్ అనస్థటీస్ట్ రాజా ఆ విషయం శ్రీధర్‌కి చెప్పాడు.

'బ్లీడింగ్ ఏమీ లేదు. కారణం ఏమిటో నువ్వే చూసుకో' అన్నాడు శ్రీధర్ గంభీరంగా.

రాజాకి కారణం అంతుపట్టలేదు. వెంటనే సీనియర్‌కి కబురు పంపించాడు. క్షణంలో వచ్చేశాడు సీనియర్ అనస్థటీస్ట్ భాస్కర్. నిజమే బి.పి. డ్రాప్ అవుతోంది. బ్లడ్ వేగాన్ని పెంచి, ఐ.వి. ఫ్లూయిడ్స్ వేగాన్ని పెంచాడు. మెడిసిన్స్ ఇచ్చాడు. కానీ ఏమీ లాభం లేకపోయింది. బి.పి.లో మార్పులేదు.

దాంతో భాస్కర్‌కి అనుమానం వచ్చింది. ఇంటర్నల్ బ్లీడింగ్ ఎక్కడైనా వుందేమో చెక్‌చేసుకోమని శ్రీధర్ని హెచ్చరించాడు.

కానీ శ్రీధర్ ఒప్పుకోలేదు. 'ఆపరేషన్ అయిపోవచ్చింది. ఏ ప్రాబ్లమ్ లేదు' అన్నాడు ధీమాగా.

భాస్కర్, పేషంట్‌ని వెల్లకిలా తిప్పాడు. పేషంట్ గుండె ఆగిపోయింది. కార్డియాక్ అరెస్ట్! శ్రీధర్ ఒక్కసారి నెర్వస్ అయిపోయాడు. అనస్థటీస్ట్‌లు ఇద్దరూ కార్డియాక్ మసాజ్ చేశారు. గుండె కొట్టుకోవడం ఆరంభించింది.

కానీ అబ్డమిన్ ఉబ్బిపోయి ఉంది. భాస్కర్ ప్రశ్నార్థకంగా శ్రీధర్ వంక చూశాడు. శ్రీధర్ ఇంకా నెర్వస్ స్టేట్‌లోనే వున్నాడు. అసిస్టెంట్లు కంగారు పడుతున్నారు. వెంటనే జనరల్ సర్జన్ సుధీర్ కోసం కబురు పెట్టారు. పరుగున వచ్చాడు సుధీర్. పరిస్థితి

గమనించి వెంటనే అబ్డమిన్ ఓపెన్ చేశారు. అందరికీ షాక్. లోపలంతా రక్తం. ఏ రక్తనాళం నుండి లీక్ అవుతుందో చెక్ చేశారు.

శరీరంలో వున్న అతి పెద్ద రక్తనాళం అయోర్టా నించి లీక్ అవుతోంది. అందరి మొహాలు పాలిపోయాయి. బయటికి వచ్చి కార్డియాక్ సర్జన్ మాధవరావ్ సెల్‌ఫోన్‌కి రింగ్ చేశాడు. అదృష్టవశాత్తూ అప్పటికే హాస్పిటల్ గేట్ దగ్గరికి వస్తూ వున్న మాధవరావు పరుగున వచ్చి వాలిపోయాడు.

సుధీర్ మాధవరావు కలిసి అయోర్టా రిపేర్ చేశారు. కానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది. గుండె వేగం తగ్గింది. చూస్తుండగానే హార్ట్‌బీట్ ఆగిపోయింది. మరోసారి కార్డియాక్ మసాజ్ చేశారు. ఇంజక్షన్స్ ఇచ్చారు. కానీ లాభం లేకపోయింది. పేషంట్ డైడ్. అంతమంది డాక్టర్లనీ సవాలు చేసి తన పనిముగించుకుని సగర్వంగా వెళ్ళిపోయింది మృత్యుదేవత!

✧ ✧ ✧

స్పెషల్ రూమ్‌లో కూర్చున్న సుజాత లేచి బయటికి వచ్చింది. ఆపరేషన్ అయిందని తెలుసుకుని ఇంటికి వెళ్దాం అని కబురు చేసింది. మళ్ళీ ఏ కబురూ రాలేదు. ఫోన్ చేసినా ఎవరూ సరిగ్గా చెప్పడం లేదు. విసుగువేసి మూడో అంతస్థులో వున్న ఆపరేషన్ థియేటర్ దగ్గరికి వెళ్ళింది. ఏమిటి విషయం అని నిలదీసింది.

'ఏదో చిన్న కాంప్లికేషన్ వచ్చింది. డాక్టర్స్ ఎటెండ్ అవుతున్నారు' అని చెప్పారు. సుజాత గుండె ఝల్లుమంది. అక్కడే కాలు కాలిన పిల్లిలా తిరగసాగింది.

చూస్తుండగానే డాక్టర్ మాధవరావు అమితవేగంగా థియేటర్‌లోకి దూకుసుపోయాడు. సుజాతకి కాళ్ళూ, చేతులూ ఆడలేదు. ఎవరైనా బయటికొస్తే అడుగుదామని ఆరాటం! ఎవరూ రావడం లేదు. దేవుడికి దణ్ణాలు పెడుతూ కూర్చుంది.

అలా ఎంతసేపు గడిచిందో, డాక్టర్ రమణ మెల్లిగా బయటకు వచ్చాడు. సుజాత ప్రాణం లేచి వచ్చింది. పరుగున అక్కడికి వెళ్ళింది.

'రమణా! ఆపరేషన్ అయిందా? స్వర్ణ ఎలా వుంది? నేను చూడవచ్చా?' రమణ తలవంచుకున్నాడు.

"సారీ మేడమ్!"

'వాట్ డూ యూ మీన్ బై సారీ!' అసహనంగా అడిగింది సుజాత.

'షీ ఈజ్ నో మోర్!' చెప్పలేక చెప్పలేక చెప్పాడు రమణ.

గిర్రున వెనక్కి తిరిగింది సుజాత. మూడంతస్థులూ దిగి స్పెషల్ రూమ్‌లోకి వెళ్ళి కూలబడింది. బుర్ర మొద్దుబారి పోయింది. అలా ఎంతసేపు కూర్చుందో తలుపు మెల్లిగా తెరుచుకునే సరికి ఉలిక్కి పడి చూసింది.

రమేష్ లోపలికి వచ్చాడు.

'నువ్వింకా వెళ్ళలేదా? మనం వుండి చేసేది ఏముంది? వున్నాడుగా మన హీరో! వాడే చూసుకుంటాడు. ఆపరేషన్ అయిపోయి వుండాలే!'

అంతే! బావురుమని ఏడిచింది సుజాత.

'అయిపోయింది అన్నయ్యా, అన్యాయం జరిగిపోయింది!'

నెత్తిన పిడుగుపడినట్లు అయింది రమేష్‌కి.

'ఏమైందమ్మా' అన్నాడు.

పరుగున వచ్చి అతన్ని కావలించుకుంది. "స్వర్ణ మనను అన్యాయం చేసి వెళ్ళిపోయింది అన్నయ్యా".

కుప్పకూలిపోయాడు రమేష్. తలుపు తెరుచుకుని బయటకు వచ్చింది సుజాత.

'ఎవరు? ఎవరక్కడ డాక్టర్ని పిలవండి!'

ఇద్దరు సిస్టర్స్ పరిగెట్టుకు వచ్చారు.

'కామ్ డౌన్ మేడమ్!' అంటూ సుజాతని లోపలికి తీసుకు వెళ్ళారు.

✧ ✧ ✧

ఆపరేషన్ థియేటర్లో అంతా సీరియస్‌గా వున్నారు. ఎవరికి వారే మాట్లాడాలని ప్రయత్నించి విఫలం అవుతున్నారు. జరిగింది ఏమిటో అందరికీ తెలుసు. అది ఖచ్చితంగా శ్రీధర్ చేసిన పొరపాటు. అందులో ఏ మాత్రం సందేహం లేదు.

కానీ ఇది ప్రైవేట్ నర్సింగ్‌హోమ్. ఎంతో బాగా నడుస్తున్న నర్సింగ్‌హోమ్. చెడ్డ పేరొస్తే తద్వారా లాభం పొందాలని కాచుకూర్చున్నారు ఈ నర్సింగ్‌హోమ్ పచ్చదనం ఓర్వలేనివారు. వారికీ విషయం తెలిస్తే అనర్థం జరిగిపోతుంది కాబట్టి ఈ విషయం బయటికి పొక్కకుండా జాగ్రత్తపడాలి. శ్రీధర్ కోసం చూశారు. శ్రీధర్ అక్కడ లేదు. శ్రీధర్‌కి చేదోడు వాదోడుగా వ్యవహరించే రమణ రంగంలోకి దిగాడు.

చకచక ఏర్పాట్లు చెయ్యబడ్డాయి. అంబులెన్స్ వచ్చి హాస్పిటల్ వెనకవైపు ఆగింది. సెడేషన్ మత్తులో వున్న రమేష్‌తో, హృదయ విదారకంగా విలపిస్తున్న సుజాతతో శాశ్వత నిద్రలో మునిగిపోయిన స్వర్ణభౌతిక కాయంతో మరికొంత హాస్పిటల్ స్టాఫ్‌తో రమేష్ స్వంత ఊరి వైపు సాగిపోయింది అంబులెన్స్.

రమేష్ ఊరికి ఫోన్ చేసి చెప్పమనీ, శ్రీధర్‌ని వెంటనే పంపించమనీ చెప్పింది సుజాత. 'నేనే స్వయంగా తీసుకువస్తాను' అని చెప్పాడు రమణ. అంబులెన్స్ వెళ్ళాక ఊపిరి పీల్చుకున్నారు అందరూ!

మొహాల మీద నవ్వు పులుముకుని మళ్ళీ తమ రొటీన్‌లో మునిగిపోయారు. శ్రీధర్ కోసం వెతకడం మొదలు పెట్టాడు రమణ. ఇంట్లో లేడు, క్లబ్‌లో లేడు. మామూలుగా వెళ్ళే ఫ్రెండ్స్ ఇళ్ళలో కూడా లేడు.

✧ ✧ ✧

రమేష్ స్వంత ఊరిలో కబురు తెలియగానే నిర్ఘాంతపోయారు. అందరు బంధువులకూ ఫోన్లు చేసి చెప్పారు. అందరూ వచ్చారు. స్వర్ణ తల్లిదండ్రులనూ, స్వర్ణ పిల్లలనూ పట్టడం బ్రహ్మప్రళయం అయింది.

మరునాడు ఉదయం పదిగంటలకు అగ్నికి ఆహుతి అయిపోయింది స్వర్ణ.

చివరి క్షణం వరకూ భర్త వస్తాడని ఎదురు చూస్తూనే ఉంది సుజాత. శ్రీధర్ రాలేదు.

'అన్నయ్యా! నాకెందుకో భయంగా వుంది. నేను వెళ్ళి ఆయన్ను తీసుకొస్తాను...' అంది.

'అలాగే వెళ్ళిరామ్మా' అన్నాడు రమేష్.

ఇంటికి వచ్చింది సుజాత. శ్రీధర్ అయిపూ అజా లేడు. అనుమానం వున్న అన్నిచోట్లా వెతికించింది. ఫలితం శూన్యం. పేపర్లో వేయిస్తే పరువుపోతుందని హాస్పిటల్ వాళ్ళ భయం.

స్వర్ణ పోయిన పదవ రోజున సుజాతకి కొరియర్లో ఒక లెటర్ వచ్చింది. భర్త చేతిరాత చూడగానే ప్రాణం లేచి వచ్చింది సుజాతకి. వెంటనే ఆ కవర్ ఓపెన్ చేసింది. చాలా కాయితాలున్నాయి దానిలో అన్నింటికీ పైన ఒక ఉత్తరం.

ప్రియమైన నా సుజాతకి నీ శ్రీధర్ రాస్తున్న ఆఖరు ఉత్తరం.

సుజీ నా మనస్తత్వం నీకు తెలుసు. నా గతం, నా వర్తమానం అన్నీ నీకు తెలుసు. ఈ ప్రాక్టీసు ప్రారంభించాక నేనెటువంటి ఆత్మవంచనకి లోనయ్యానో, నా నిస్సహాయతకు ఎంత బాధపడ్డానో నీకు తెలుసు.

ఎన్నోసార్లు మా నర్సింగ్‌హోమ్‌లో ఎన్నో పొరపాట్లు జరిగాయి. మా నిర్లక్ష్యం వల్ల కొంతమంది ప్రాణాలు కోల్పోతే మరికొంతమంది వికలాంగులు అయ్యారు. అది ఖచ్చితంగా మా పొరపాటే అని తెలిసినా కప్పిపుచ్చాం. అంతేకాదు ఫీజు అణాపైసలతో కడితేగానీ శవాన్ని ఇవ్వం అని భీష్మించుకు కూర్చున్నాం. మా దగ్గర డబ్బుంది. ఎవరి నోరైనా మూయించగల సత్తా వుంది. వీటన్నిటితో ఏర్పడిన ధీమా. ఆ ధీమాయే నాలోని అహాన్ని పెంచింది. నా అంత గొప్పవాడు లేడని గర్వం. నేను తప్పుచెయ్యనన్న ఓవర్ కాన్ఫిడెన్స్. ఈ దుర్గుణాల వల్ల నాలోని డాక్టర్ సగం చచ్చిపోయాడు.

ఇవాళ డాక్టరుగా, మనిషిగా నేను పూర్తిగా చచ్చిపోయాను. నా నిర్లక్ష్యం వల్ల ఓ నిండు ప్రాణం బలి అయిపోయింది.

'ఒకసారి ఒక డాక్టరు ఇంతమంది కంతులు కోశానుగానీ నా కంతి కోసినపుడు పడినంత బాధ ఎప్పుడూ పడలేదు' అన్నాడుట. ఆ బాధ ఏమిటో నాకిప్పుడు అర్థం అవుతోంది.

ఈసారి బలి అయిపోయింది ఎవరో కాదు. 'అన్నయ్యా!' అని నోరారా పిలిచే నా చెల్లెలు స్వర్ణ.

వాడి పెళ్ళికి వెళ్ళలేక పసుపు బట్టలతో చూడాలన్న నా కోరిక తీర్చడం కోసం నా దగ్గరికి పరిగెట్టుకు వచ్చిన నా ప్రాణమిత్రుడి భార్య.

నా భుజాల మీద ఆడుకున్న కళ్యాణ్, మాధవిల తల్లి.

నువ్వు నన్ను క్షమిస్తావు. రమేష్ కూడా క్షమించేస్తాడు. కానీ నన్ను నేను క్షమించుకోలేను. అందుకే శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను. చచ్చిపోతానని చెప్పను. ఎందుకంటే చావటం కంటే పశ్చాత్తాపంతో కుమిలి పోవడం మరింత కష్టం. నాకు నేను ఆ రెండో శిక్షను విధించుకుంటున్నాను.

ఒంటరిగా వెళ్ళిపోతున్నాను. నా యావదాస్తికి నిన్ను వారసురాలిని చేస్తున్నాను.

నీకు కొన్ని బాధ్యతలు అప్పగిస్తున్నాను.

నా ఒరిజినల్ సర్టిఫికెట్స్ అన్నీ తగలబెట్టు.

రమేష్‌కి ధైర్యం చెప్పు.

మరో విన్నపం. నా నిర్లక్ష్యం వల్ల తల్లిలేని పిల్ల అయిపోయింది. మాధవిని నీ కోడలిని చేసుకుని తల్లివై ఆదరించు.

నిన్ను వొంటరిగా వదిలివెళ్ళిపోతున్నాను. నన్ను క్షమించు.

మరి సెలవా!

నీ

శ్రీధర్

కుప్పకూలిపోయింది సుజాత.

✧ ✧ ✧

కాలచక్రం పన్నెండు చుట్లు తిరిగింది.

డాక్టర్ రమేష్ రిజైన్ చేసి వచ్చి శ్రీ నర్సింగ్‌హోమ్‌లో పనిచేస్తున్నాడు. సుజాత ఆధ్యాత్మిక మార్గం ఎంచుకుని కాలం వెళ్ళదీస్తోంది.

శ్రీధర్ పెద్దకొడుక్కి పెళ్ళయింది. రెండోవాడు హర్షకీ, రమేష్ కూతురు మాధవికీ పెళ్ళయింది. వాళ్ళిద్దరూ శ్రీ నర్సింగ్‌హోమ్‌లోనే పనిచేస్తున్నారు. రమేష్ కొడుకు కళ్యాణ్ పెళ్ళి చేసుకుని ఫారెన్ వెళ్ళిపోయాడు.

ఒక రోజు పొద్దున రమేష్ సుజాతకి ఫోన్ చేశాడు.

'ఏమిటన్నయ్యా' అంది సుజాత.

"ఇప్పుడే కేరళనించి ఒక పేషెంట్ వచ్చాడమ్మా. తెలుగువాడే. అతనికి మన గురించి ఎవరో చెప్పారట. తెలుగు పుష్కలంగా మాట్లాడుతున్నాడట. ఆ వ్యక్తి గుర్తులు అడిగితే చెప్పాడు మన శ్రీధర్ ఏమో అని ఆశగా వుందమ్మా? వెళ్ళి చూసొద్దా మనుకుంటున్నాను".

పేలవంగా నవ్వింది సుజాత. "ఏమిటన్నయ్యా నీ వెర్రి – ఈ పన్నెండేళ్ళలో వందలసార్లు ఇలాగే పరిగెట్టావు. ఇంకా ఆశగా వుందా నీకు?" అంది.

"వాడు తప్పక దొరుకుతాడమ్మా! నేను పోయేలోగా. వాడినెలాగైనా వెతికి పట్టుకుంటాను. 'నీ తప్పేం లేదురా! మనమూ మనుషులమేగానీ దేవుళ్ళం కాదు కదా!' అని నచ్చచెప్తాను. వాడిని మళ్ళీ తీసుకొచ్చి ఈ కుర్చీలో కూర్చోబెడతాను" అన్నాడు రమేష్.

ఫోన్ పెట్టేసి కళ్ళు తుడుచుకుంది సుజాత.

*రచన మాసపత్రిక, సెప్టెంబర్ 2002*